# అవమానానికి ఖరీదు

## -పెద్దింటి అశోక్‌కుమార్

“ఈ విషయం ఎవరికీ తెలియదు. తెలియని విషయాన్ని తెలియకుండానే ఉంచుదాం. నలుగురికీ తెలిస్తే మనకే అవమానం” ఒక నిర్ణయానికి వచ్చినట్టు స్థిరంగా అన్నాడు వేణుగోపాల్.

అతని నిర్ణయానికి తన మౌనంతోనే అంగీకారాన్ని తెలిపారు సోమయాజి. సత్యవతి ఏదో చెప్పబోయి భర్త మొహంలోకి చూసి ఆగిపోయింది. అంతవరకూ కుమిలి కుమిలి ఏడుస్తున్న జ్యోతి కళ్ళు తుడుచుకుని వేణుగోపాల్ వైపు విస్మయంగా చూస్తూ అడిగింది.

“అన్నయ్యా! ఇక్కడ అన్యాయం జరిగింది నీ చెల్లెలికేనన్న విషయాన్ని గుర్తుంచుకునే మాట్లాడుతున్నావా? జరిగిన అన్యాయం చెప్పుకోవడం కూడా అవమానమని భావించి మనకు మనం ముడుచుకుపోతే మరిన్ని అన్యాయాలు జరగవూ?” ఆమెకు దుఃఖం ఆగడంలేదు. గొంతుకూరుకుపోయి మాటలు ఆగిపోయాయి.

“అన్యాయం జరిగింది నా చెల్లెలికి కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నాను. జరిగినది ఒక పీడకల అనుకుని మరచిపోవడమే దీనికి సరైన పరిష్కారం. నలుగురికి తెలిస్తే పోయేది మన పరువే” తన నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నట్లు అన్నాడు వేణుగోపాల్.

“అది జరగని పని. తప్పు చేసింది వాడు. వాడు తలెత్తుకుని తిరుగుతుంటే నేను మాత్రం కుమిలి కుమిలి ఏడ్వాలా? తప్పు చేసినందుకు వాడు తప్పకుండా శిక్షింపబడాలి. మళ్లీ ఈజన్మలో వాడు ఇలాంటి తప్పు చేయకూడదు. ప్రతి మగాడికీ వీడి జీవితం ఒక గుణపాఠం కావాలి” ఆవేశంగా అన్నది జ్యోతి.

వేణుగోపాల్ ఏదో అనబోతుంటే వారించి కూతురు తలను వాత్సల్యంతో నిమురుతూ చెప్పాడు సోమయాజి.

“చూడమ్మా! మేము నీకంటే ఎక్కువ బాధపడుతున్నాం. అంతా జరిగిపోయాక చేసేదేమంది చెప్పు. మనది పరువుగా బ్రతికిన కుటుంబం. అక్కయ్య పెళ్లి జరగాలి. నీ పెళ్లి జరగాలి. ఈ విషయం నలుగురికీ తెలిస్తే ఎవరు చేసుకుంటారు చెప్పు?”

తండ్రివైపు చూసింది జ్యోతి. మరోసారి దుఃఖం పొంగి వచ్చింది. ఏడుస్తూనే అరుస్తున్నట్లుగా అడిగింది “ఒక తండ్రి అనాల్సిన మాటలు కావివి. నీ కూతురు...అంటే నేను ఒక దుర్మార్గుడి చేతుల్లో రేప్‌కు గురి అయితే అతనిపై కేసు పెట్టాల్సిందిపోయి కాంప్రమైజ్ కోసం వెళ్తారా? కేసు పెడతానంటున్న నన్ను వద్దని వారిస్తారా? మీకు మీ పరువు ప్రతిష్ఠలెంత ముఖ్యమో నాకు నా మాన మర్యాదలు అంత ముఖ్యం. ఎవరేం చెప్పినా నా నిర్ణయం మారదు.”

కూతురు పరిస్థితి చూస్తుంటే సత్యవతికి గుండె తరుక్కుపోతోంది. ఏడుస్తున్న కూతురును లాలనగా అక్కున చేర్చుకుంది. జ్యోతి పసిపాపలా ఏడుస్తుంటే ఓదార్చింది సత్యవతి.

“చూడమ్మా...నాన్నా, అన్నయ్య ఏమంటున్నారో? వాళ్ళకి నువ్వయినా సర్దిచెప్పమ్మా?” వెక్కుతూ చెప్పింది జ్యోతి.

సత్యవతి అనునయంగా కూతురు తల నిమురుతూ బుజ్జగిస్తున్నట్లుగా అన్నది.

“అది ఆడదాని దురదృష్టమమ్మా. అరిటాకు ముల్లు మీద పడినా ముల్లు అరిటాకు మీద పడినా నష్టం అరిటాకుకే. మా కళ్లముందే నీ భవిష్యత్తు నాశనమవడం మేము చూడలేమమ్మా. నా బంగారు తల్లివి కదూ...” ఆమె మాటలు పూర్తికాకముందే కౌగిలిలోనుండి విడివడి దూరంగా జరిగిన ‘నీవు కూడా వాళ్లతో కలసిపోయావా?’ అన్నట్లు చూసింది జ్యోతి ఆవేదనగా.

“వాడు లక్షాధికారి కొడుకు. మనం కేసు పెట్టినంత మాత్రాన పోలీసులు వాడినేం చేయలేరు. అవసరమొస్తే సాక్షాలన్నీ తారుమారు చేయగలడు. వాడితో మనం ఢీకొనలేం. రెండు లక్షలు ఇస్తానన్నాడు. కాదంటే ఎక్కువ డిమాండ్ చేద్దాం. అంతేగానీ ఆవేశంగా కేసు పెడితే అన్ని విధాల నష్టపోయేది మనమే. పైగా ఇది పరువుకు సంబంధించిన సమస్య. అణువంత బయటకు పొక్కినా లోకం కోడై కూస్తుంది” సముదాయిస్తున్నట్లుగా చెప్పాడు వేణుగోపాల్.

అతడివైపు ఛీత్కారంగా చూసింది జ్యోతి.

“ఛీ...నువ్వూ ఒక మగాడివేనా? ఆవేశంతో వాడిపై ప్రతీకారం తీర్చుకోవాల్సిందిపోయి నా ఆవేశాన్నే నీరుగారుస్తావా? పౌరుషం అంటే అర్థం తెలుసా? ఇలాగే రోజుకొకడితో నన్ను రేప్ చేయించి వాడితో బేరాలు కుదుర్చుకో. లక్షలు...లక్షలు సంపాదించవచ్చు. నాకు జరిగిన అన్యాయానికి నువ్వు ఆవేశపడి వాడిని చంపబోయి నువ్వు చచ్చినా నీ పౌరుషానికి సంతోషపడేదాన్ని” అరిచింది జ్యోతి.

“ఏమిటా మాటలు? అలాగేనా మాట్లాడేది?” అన్నట్లు చూసింది సత్యవతి. సోమయాజి దగ్గరగా వచ్చి తలపై చేయి వేసి నిమురుతూ అన్నాడు.

“మన కుటుంబ పరువు ప్రతిష్ఠలను కూడా ఒక్కసారి ఆలోచించమ్మా. ఇంతవరకూ ఎవ్వరూ వేలెత్తి చూపకుండా బ్రతికాం. ఈ విషయం బయటకు పొక్కిందనుకో...తలెత్తుకుని తిరగలేం. కుదిరిందనుకున్న అక్కయ్య పెళ్లి తప్పిపోతుంది. నిన్ను పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రారు. ఇంత నష్టం మనకు జరిగినా వాడికి మాత్రం శిక్ష పడదు. డబ్బున్నవాడు ఎలాగో తప్పుకుంటాడు.”

వాళ్ల మాటలు వింటుంటే కోపం రావడంలేదు. దుఃఖంకూడా రావడంలేదు. పరువు ప్రతిష్ఠలంటూ ఆత్మవంచన చేసుకుంటున్నందుకు జాలి కలుగుతోంది జ్యోతికి. తండ్రివైపు నిర్వేదంగా చూస్తూ అడిగింది “నాన్నా! ఈ రోజు ఐదులక్షలు ఇచ్చాడని విడిచిపెడితే రేపు వాడొచ్చి నిన్నటికంటే ఎక్కువిస్తాను నీ కూతురును పంపించమంటే పంపిస్తావు కదూ? వాడు నా బ్రతుకును అన్యాయం చేసినందుకాదు నాన్నా, నా శీలానికి వెల కడుతున్నందుకు బాధగా వుంది. తప్పును తప్పని చెప్పి ఖండించడంపోయి ఆలోచనే తప్పని చెప్పాలనుకుంటున్నారు. ఎవరికి వాళ్ళం పరువు ప్రతిష్ఠ అంటూ చేతులు ముడుచుకుని కూర్చుంటే వాడు రోజుకొక ఆడదాని జీవితాన్ని నాశనం చేస్తాడు. కన్నకూతురు అత్యాచారానికి గురైతే ధైర్యంగా పోరాడాల్సిందిపోయి నాకే పిరికిమందు నూరిపోస్తారా? పరువు ప్రతిష్ఠలంటూ నా అభిమానాన్ని దెబ్బతీస్తారా? ఎవరేం చెప్పినా నేను వినను. పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి రిపోర్టు ఇస్తాను” అంటూ బయల్దేరింది జ్యోతి. అందరూ అవాక్కయిపోయారు. ముందుగా తేరుకున్నది సోమయాజి. ఆమెను అడ్డుకోవడం అసాధ్యమనిపించింది. అయిష్టంగానే కూతురు వెంట మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు.

జరిగిందంతా చెప్పి కంప్లయింట్ వ్రాసి ఇచ్చింది జ్యోతి. ఎస్సైని ప్రక్కకు పిలిచి బ్రతిమాలి కేసు బుక్ కాకుండా చూడమన్నాడు సోమయాజి. ఎస్సై అతనివైపు విచిత్రంగా చూసింది. అలా సాధ్యం కాదని చెప్పింది. ఇది ఆమె జీవితానికి సంబంధించిన సమస్య అనీ, తమది పరువుగల కుటుంబమనీ చెప్పాడు. జ్యోతి ఏదో ఆవేశంమీద అలా కంప్లయింట్ ఇచ్చిందని, ఆమె తన మనసును మార్చుకుంటుందని ప్రాధేయప

డ్డాడు. ఒక స్త్రీగా ఆలోచించమని అభ్యర్థించాడు.

విస్తుపోయింది జ్యోతి. కోపంతో ఆమె హృదయం రగిలిపోయింది. మరోసారి తన నిర్ణయాన్ని ఎస్సైతో గట్టిగా చెప్పింది.

"అవమానం జరిగింది నాకు. నేను కంప్లైంట్ ఇస్తున్నాను. మీరు అతడిని అరెస్టు చేయాలి. అవసరమైతే మా నాన్నని కూడా. ఎందుకంటే తప్పును నిరసిస్తున్న నన్ను అడ్డుకుంటున్నందుకు" అంటూ విసురుగా అక్కడినుండి బయటపడింది.

అన్యమనస్కంగా ఇల్లు చేరుకున్న జ్యోతి ఇంట్లోని దృశ్యాన్ని చూసి విస్తుపోయింది. హృదయాన్ని గునపాలతో పెకిలిస్తున్నంత బాధ. తన అభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని, ఆడతనాన్ని కరెన్సీ రూపంలో బేరమాడుతున్నారు.

"మావాడిది తప్పే. మీరు ఎంత డబ్బు అడిగినా ఇస్తాం. కేసును మాత్రం స్టేషన్‌వరకు వెళ్లనీయకండి. అది ఇద్దరికీ మంచిదికాదు" అతడి కంఠంలో అర్థింపు లేదు. బెదిరింపు వుంది.

వేణుగోపాల్ ఏదో అంటున్నాడు. వారి మాటలు వినదలచుకోలేదు జ్యోతి. కోపంగా వెనక్కు తిరిగింది. వేగంగా బయటకు నడిచింది. లాయర్ ముకుందం వద్దకు చేరుకోవడానికి ఆమెకు అరగంట పట్టింది. ఆందోళనను అణచిపెట్టుకుని అతి మామూలుగా ఇంట్లోకి అడుగుపెట్టింది. జ్యోతిని చూడగానే పలకరింపుగా నవ్వుతూ కుశల ప్రశ్నలు వేసాడు ముకుందం.

"అంకుల్! ఒకమ్మాయి రేప్‌కి గురైందనుకో. అప్పుడేం చేయాలి?"

అతి మామూలుగా ఆమెవైపు చూస్తూ చెప్పాడు ముకుందం "ఏమందమ్మా! పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టాలి."

"భలేవారే. అలా అయితే ఆ అమ్మాయి జీవితం నాశనం కాదూ? కేసు పెడితే కావాలని పనిగట్టుకుని పదిమందికి చెప్పినట్టు కాదా? దానివల్ల ఆ అమ్మాయికి ఒరిగేదేంటి? పోయిన శీలాన్ని తెచ్చుకుంటుందా?"

"అయితే నువ్వేమంటావు?" ఆమెవైపు సాలోచనగా చూస్తూ అన్నాడు ముకుందం. అప్పుడప్పుడూ ఆమెతో వాదానికి దిగడం అతడికి మామూలే.

"ఖరీదు కట్టమంటాను. మహా అయితే అతడికి ఏడేళ్లు జైలుశిక్ష పడుతుండవచ్చు. కానీ ఈ అమ్మాయి జీవితమే పాడవుతుందికదా. అందుకని గుట్టు చప్పుడు కాకుండా రెండుమూడు లక్షలు డిమాండ్ చేస్తే ఎక్కువ కట్నం ఇచ్చి మంచి సంబంధం చూడవచ్చు. న్యాయం, శిక్ష అని కేసు పెడితే సమాజం కుక్కకన్నా హీనంగా చూడదూ?" అడిగింది పరిశీలనగా చూస్తూ జ్యోతి.

"అక్కడే తప్పుగా ఆలోచిస్తున్నావు జ్యోతీ! ఎవరికి వారు ఇలా స్వార్థచింతన చేయబట్టే నేరస్థులు పెద్దమనుష్యుల్లా చెలామణీ అవుతున్నారు. సమాజం మనని ఎలా చూస్తుంది అన్నది మన మానసిక స్థాయిమీద ఆధారపడి వుంటుందమ్మా. సమాజం ఒక అద్దంలాంటిదంతే. మనం ఏ వేషం వేసుకుని చూస్తే ఆ వేషం కనిపిస్తుంది.

ధైర్యంగా నిలబడాలి. తప్పును తప్పు అని ఖండించాలి. ఆ తప్పు మరోసారి మరొక్కరికి జరక్కుండా చూడాలి. ఇలా ఎదిగిననాడు ఆమె జీవితం నాశనం కాదు. ఆదర్శమౌతుంది. ఇంతకూ ఎవరమ్మా ఆ అమ్మాయి?" మామూలుగా అడిగాడు ముకుందం.


"నేనే అంకుల్ ఆ అమ్మాయిని. ఇంట్లో నా శీలానికి ఖరీదు కడుతుంటే మీరైనా న్యాయం చేస్తారని వచ్చాను" ఆమె కంఠం వణికింది.

పక్కనే బాంబు పేలినట్లు అదిరిపడ్డాడు ముకుందం. జ్యోతివైపు ఆందోళనగా చూసాడు. అప్పటికే అక్కడికి చేరుకున్నాడు సోమయాజి. తమ్ముడికి జరిగిందంతా వివరంగా చెప్పాడు.

ముకుందంలో ఆవేశం అణగారిపోయింది. ఇంతకు ముందులా కాకుండా నిదానంగా ఆలోచిస్తున్నాడు. అప్పుడే అతని మనోభావాలను పసిగట్టి నిట్టూర్పు విడిచింది జ్యోతి.

"ఒక్క నాన్నగాకే కాదమ్మా. మన సర్కిల్ మొత్తం కూడా మొహమెత్తుకుని తిరగలేం. ఎలా జరిగిందని బాధపడడం కాదు, ఇప్పుడేం చేస్తే బాధలుండవని ఆలోచించాలి. నువ్వు చదువుకున్నదానివి. ఆవేశంగా కాకుండా నిదానంగా ఆలోచించు. ఒక తప్పు జీవితాన్ని శాసించడం కాదు, ఆ తప్పు తాలూకు ఛాయలు కూడా పడని జీవితాన్ని ఎన్నుకోవాలమ్మా" అతడి మాటలు పూర్తి కాకుండానే అందుకుంది జ్యోతి వెక్కిరింపుగా.

"అంకుల్! ఇప్పుడేగా మీరు చెప్పారు మానసికంగా ఎదగాలని. ఇప్పటికిప్పుడే మాట మార్చారెందుకు? మీ అన్న కూతురు జీవితం నాశనమవుతుందనా లేక మీ కీర్తి ప్రతిష్ఠలు నా మూలంగా దెబ్బ తింటాయనా? మీరు ఎవరెన్ని చెప్పినా నా నిర్ణయం మారదు. తప్పు చేసిన ఆ రాక్షసుడికి, కామాంధుడికి శిక్ష పడాల్సిందే!" అంది జ్యోతి.



"మీరు అడ్డుకున్నంత మాత్రాన నా ఆలోచనా ధోరణి మారదు. అది ఉప్పెనై లేస్తుంది. ప్రళయమై విరుచుకుపడుతుంది. నావెంట సాటి ఆడవాళ్ళయినా ఉండరా? ఇప్పుడే కదిలిస్తాను. మామూలుగా కాదు, ఒక మహోద్యమ శక్తినై నిలుస్తాను. అతడి ఇనుప బీరువాలో వున్న డబ్బు మమ్మల్నేం చేస్తుందో మీరే చూస్తారు. గుడ్‌బై" విసురుగా అక్కడినుండి కదిలి వెళ్లపోయింది జ్యోతి ధైర్యంగా.

ఇద్దరూ నోట మాట రాక స్థాణువుల్లా నిలబడిపోయారు.

★